సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 4 । మార్చి । 2023



ఒక్కొక్కరిపై ఎన్నో కేసులు

ఇటీవల జరిగిన దోపిడీ కేసులో పట్టుబడిన నిందితులపై అనేక కేసులు ఉన్నాయి.

IIలో ▸



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా) రూ.	57,810
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,164
3శాతం జీఎస్టీతో	రూ.5,319
నవర (8గ్రా)	రూ.42,552

గరిష్టం/కనిష్టం
34.5 /22.2

వాతావరణం

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉన్నాయి. వాతావరణంలో తేమ 27శాతం ఉంది. దీంతో రాత్రి చలితీవ్రత ఎక్కువగా ఉంది.

న్యూస్‌రీల్

కేంద్ర ప్రభుత్వ అవార్డును అందుకున్న కలెక్టర్



అవార్డును అందుకుంటున్న కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు

నెల్లూరు (అర్బన్): పునరుత్పాదక ఇంధన రంగాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు అవార్డును ప్రకటించింది. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజీ, మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ నిర్మించడం ద్వారా పెన్నార్ డెల్టా వ్యవస్థను ఆధునికీకరించడం, సాగునీటి వృథాను అరికట్టడంతో ఈ అవార్డును అందజేశారు. కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర విద్యుత్ నూతన పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ఆర్‌కే సింగ్ చేతుల మీదుగా సీబీఐబీ (సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్) అవార్డును అందుకున్నారు.

96.87 శాతం పింఛన్ల పంపిణీ



కోవూరు మండలం వేగూరులో మస్తానమ్మకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా వేగవంతంగా జరుగుతోంది. శుక్రవారం మూడో రోజుకు 3,08,953 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 2,99,276 మంది అందజేశారు. 96.87 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ పూర్తయింది. పింఛన్ల పంపిణీలో రాపూరు, ఇందుకూరుపేట, నెల్లూరు రూరల్ మండలాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ నెల 5వ తేదీ వరకు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేయనున్నారు.

పారిశ్రామిక ఆశలు

విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడుల ఒప్పందాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామాలు జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ఆశలు మోసులెత్తుతున్నాయి. సువిశాలమైన సాగరతీరం, రైల్, రోడ్డు, సీ కనెక్టివిటీతో పాటు త్వరలో ఏర్పాటు కానున్న విమానాశ్రయం, కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పక్కనే పరిశ్రమల స్థాపనకు అనువైన విశాల భూవనరులు, నీరు, మౌలిక వసతులు జిల్లాలో ఉన్నాయి. ఇప్పటికే జిల్లా నలుమూలల విస్తరించిన అనేక పారిశ్రామికవాడల్లో ఎన్నో భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలతో పారిశ్రామిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఈ అనుకూల పరిస్థితులే జిల్లాకు మరికొత్త పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి.



జిల్లాలో దండిగా భూవనరులు, మౌలిక సదుపాయాలు

- కృష్ణపట్నం పరిధిలో 11,095 ఎకరాల్లో క్రిస్ సిటీ
- రామాయపట్నం పోర్టు పక్కనే సిద్ధమవుతున్న పారిశ్రామికవాడ
- కావలి తీరంలో ఇండస్ట్రియల్ కారిడార్‌కు ప్రతిపాదన
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో జిల్లాకు కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా పారిశ్రామికవేత్తలకు స్వర్గధామం వంటిది అనడంలో సందేహం లేదు. రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి తడ వరకు సువిశాల సాగర తీరం ఉంది. జిల్లాలో కూడా అత్యధిక భాగం ఉంది. ప్రధానంగా పరిశ్రమలకు అనువైన భూములు, నీరు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలతో పాటు ఉత్పత్తుల రవాణాకు రోడ్డు, రైల్వే రవాణా వసతులు ఉన్నాయి. ఇప్పటికే జిల్లా తీరం వెంబడి పారిశ్రామిక కారిడార్ విస్తరిస్తోంది. తాజాగా క్రిస్ సిటీ, ఆత్మకూరు నారంపేటవద్ద ఏర్పాటైన పారిశ్రామికవాడల విస్తరణ శరవేగంగా జరుగుతోంది. మరో వైపు చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారి, రైల్వే లైన్ పక్కనే కొడవలూరు మండలం రేగడిచెలిక నుంచి దగదర్తి మండలం అల్లూరు రోడ్డు మధ్యలో ఏపీఐఐసీ, కిసాన్‌సెజ్‌లో భూములు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే ఆసియాలో అతిపెద్ద కృష్ణపట్నం పోర్టు ఏర్పాటు కాగా, రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు అవుతున్నాయి. దీంతో పాటు దగదర్తి లేదా రామాయపట్నం సమీపంలో విమానాశ్రయం ఏర్పాటు కానుంది. ఆయా పారిశ్రామికవాడల్లో ఇప్పటికే ఎన్నో భారీ, మధ్య, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు దేశ, విదేశాల్లోని పారిశ్రామిక దిగ్గజాలు రావడమే కాకుండా అక్కడికక్కడే ఎంఓయూలు కూడా చేస్తున్నారు. దీంతో జిల్లాకు కొత్త పరిశ్రమల రాకపై ఆశలు మోసులెత్తుతున్నాయి.

కొత్త పరిశ్రమలకు స్వర్గధామం

జిల్లాలో ఇప్పటికే ఏర్పాటైన పరిశ్రమల్లో లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. తాజాగా కృష్ణపట్నం పోర్టు పరిధిలో రూ.5,783.84 కోట్లతో 11,095 ఎకరాల్లో క్రిస్ సిటీ ఏర్పాటు కానుంది. కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ పేరుతో టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ఎంఎస్ఎంఈ రంగాల పరిశ్రమలను ఇందులో ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులో వస్తే 2.96 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు, 1.71 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి దక్కనుంది. తొలి దశలో రూ.1,500 కోట్లతో 2,006 ఎకరాలు అభివృద్ధి జరుగుతోంది. అందుకోసం పర్యావరణ అనుమతులు, కండలేరు ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా అనుమతులు పూర్తయ్యాయి. నెల్లూరు జిల్లా సర్వేపల్లి వద్ద కృషక్ భారతి కో–ఆపరేటివ్ లిమిటెడ్ (క్రిభ్‌కో) పరిధిలో రూ.560 కోట్లతో బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 100 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ ద్వారా 400 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. కొత్తగా రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌కు అనుబంధంగా మరో రెండు భారీ పారిశ్రామికవాడలు సిద్ధమవుతున్నాయి. మెట్ట ప్రాంతం ఆత్మకూరు మండలం నారంపేట వద్ద 380 ఎకరాల్లో ఏర్పాటైన పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయగిరిలో దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ అందుబాటులోకి రానున్న నేపథ్యంలో దీనికి అనుబంధ పరిశ్రమలు వస్తాయని, అందుకు భూసేకరణ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

జిల్లాలో పారిశ్రామికవాడలు

క్రిస్‌సిటీ	11,095	ఎకరాలు
రామాయపట్నం	4,900	ఎకరాలు
కావలి	6,500	ఎకరాలు
నారంపేట	380	ఎకరాలు
కిసాన్ సెజ్	2,200	ఎకరాలు
ఏపీఐఐసీ	4,000	ఎకరాలు
ఎయిర్‌పోర్టు కోసం		
దామవరం వద్ద	1,350	ఎకరాలు
రామాయపట్నం వద్ద	1,300	ఎకరాలు

యువతకు ఉద్యోగాల వెల్లువ

జిల్లాలో ఇప్పటికే కృష్ణపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పడిన పరిశ్రమలతో పాటు మరికొన్ని పరిశ్రమలతో జిల్లా పారిశ్రామిక కారిడార్‌గా మారింది. కృష్ణపట్నంలో 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్స్ ఉన్నాయి. వీటిద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. కొడవలూరు, దగదర్తి మండలాల పరిధిలో కిసాన్‌సెజ్‌లో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సెజ్‌లోనే విండ్‌పవర్ ఉత్పత్తికి అవసరమయ్యే రెక్కలు తయారు చేసే భారీ పరిశ్రమ ఏర్పాటు చేసింది. అల్లూరురోడ్డు వద్ద కూడా ఇలాంటి మరో పరిశ్రమ ఏర్పాటై ఉత్పత్తి ప్రారంభించింది. మరో వైపు మిథానీ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. వీటితో పాటు తాజాగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో జరుగుతున్న ఒప్పందాల వల్ల కొత్తగా పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వాటిలో కొన్ని జిల్లాలో ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి. తద్వారా వచ్చే పరిశ్రమలను బట్టి కనీసం రెండు లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని జిల్లా అధికారులు కూడా అంచనా వేస్తున్నారు.

ఉపాధిలో ఉజ్వల భవిష్యత్



ప్రభుత్వం పారిశ్రామిక దిగ్గజాలతో సమ్మిట్ నిర్వహించి పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకోవడం మంచి పరిణామం. రానున్న రోజుల్లో నిరుద్యోగుల ఉపాధికి సంబంధించి ఉజ్వల భవిష్యత్ చూపిస్తోంది. ఆత్మకూరు నారంపేట పారిశ్రామికవాడ సిద్ధంగా ఉంది. సెంచురీ ఫ్లైసంస్థ ఆత్మకూరుకు బదులు బద్వేల్ సమీపంలోని గోపవరం వద్ద ఇటీవల పెట్టుబడులు పెట్టింది. అయితే విశాఖలో జరిగిన సమ్మిట్‌లో తన పెట్టుబడులను రూ.5 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లకు పెంచుతున్నట్లు ఆ సంస్థ అధిపతి ప్రకటించడం సంతోషించదగ్గ పరిణామం. నారంపేటలో పరిశ్రమల ఏర్పాటుకు బలమైన పునాదులు పడతాయని దృఢమైన నమ్మకం ఉంది.

– కొర్సిపాటి కిశోర్‌రెడ్డి, ఆత్మకూరు

జిల్లాకు వరం అవుతుంది



విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ జిల్లాకు వరం అవుతుంది. ఇప్పటికే ఉన్న కృష్ణపట్నం పోర్టు, నిర్మాణంలో ఉన్న రామాయపట్నం పోర్టుతో పాటు కొద్ది రోజుల్లో అందుబాటులోకి రానున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అనుబంధంగా పరిశ్రమలు నెలకొల్పే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జిల్లాలో భూమి, విద్యుత్, నీరు వంటివి మెండుగా ఉండడంతో పాటు మౌలిక వసతులు, సౌకర్యాలు ఉన్నాయి. కొన్ని పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటైతే మరింత ఆర్థికాభివృద్ధి సాధించే వీలుంది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– కూనం తాతిరెడ్డి, వైస్ చైర్మన్, రైల్ అండ్ రోడ్ ప్యాసింజర్స్ అసోసియేషన్, కావలి

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 133 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 113 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం ఉదయం జనరల్‌కు సంబంధించి 3,136 మందికి 3,093 మంది హాజరు కాగా 43 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 249 మందికి 224 మంది హాజరైతే 25 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,272 మందికి 2,236 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 299 మందికి 270 మంది హాజరయ్యారు. 29 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ప్రసన్నుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు సర్వదేవతా పరివారాన్ని ఆహ్వానిస్తూ ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు

- ముక్కోటి దేవతలకు ఆహ్వానంగా ధ్వజారోహణ
- భారీగా తరలివచ్చిన భక్తులు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో అఖిలాండ కోటి బ్రహ్మాండనాయక ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గరుడధ్వజ సంకేతంతో శుక్రవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులు గోవింద నామస్మరణల చేస్తుండగా ప్రధానార్చకులు వేదగిరి కల్యాణచక్రవర్తి ఆచార్యులు సహచర అర్చక బృందంతో కలిసి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ చేశారు. ఐదు రోజుల పాటు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవలకు సర్వదేవతా పరివారాన్ని, అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభం వద్ద గరుడ ధ్వజాన్ని ఆరోహణ చేశారు. అంతకు ముందు వేదమంత్రాలు, సుగంధ ద్రవ్యాలతో ఆలయంలో సర్వతిరుమంజనం నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి ధ్వజారోహణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తితో కొడిముద్దల స్వీకరణ

ధ్వజారోహణ అనంతరంస్వామి ఆశీస్సులుగా అందించే కొడిముద్దలను మహిళలు భక్తితో స్వీకరించారు. పిల్లలు పుట్టనివారు కొడి ముద్దలు స్వీకరిస్తే మాతృత్వం సిద్ధిస్తుందనే నమ్మకంతో భక్తులు భారీగా తరలివచ్చారు. మునుపెన్నడూ లేనంతగా భక్తులు తరలిరావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన నూతన దంపతులు, సంతానలేమితో బాధపడుతున్న వారు కొడిముద్దల ప్రసాదాన్ని స్వీకరించి ఉపవాస దీక్ష విరమించారు.

శేషవాహనంపై చిద్విలాసుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసన్న వెంకటేశ్వరుడు దేవేరులతో కలిసి శేషవాహనంపై కొలువుదీరాడు. ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు పూర్తయ్యాక శేషవాహనంపై కొలువైన స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణలు, కర్పూర నీరాజనాలను ఆస్వాదిస్తూ ఊరేగిన శ్రీవారు భక్తకోటికి దివ్యాశీస్సులను అందించారు.


ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రసన్నుడికి శనివారం హనుమంత సేవ జరుగుతుంది. స్వామివారికి ప్రీతికరమైన శనివారం రామావతారంలో ప్రసన్నుడి దుష్టశిక్షణార్థం హనుమంతుడిపై ఊరేగుతారని ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి తెలిపారు.

కార్పొరేట్ ప్రమోట్ దోపిడీ

ప్రభుత్వ పాఠశాలలు నాడు–నేడుతో రూపురేఖలు మారుతున్నాయి. సీబీఎస్ఈ స్టాండర్డ్ విద్యావిధానంలో ఇంగ్లిష్ మీడియం చదువులకు బైజుస్‌తో ఒప్పందం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఉన్నత తరగతులకు ట్యాబ్‌లు, జగనన్న గోరుముద్ద వంటి ప్రయోజనాలతో పాటు అమ్మఒడి పథకం అమలు అవుతుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల చేరిక పెరుగుతోంది. ఇంగ్లిష్ మీడియం చదువుల పేరుతో కార్పొరేట్ విద్యా సంస్థలు రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. వీటి దోపిడీని భరించలేని మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల సంఖ్యను కాపాడుకునేందుకు 'పైతరగతికి ప్రమోట్ చేయాలంటే.. ఇప్పుడే కొంత మొత్తం చెల్లించాలంటూ బెదిరిస్తూ కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలు దోపిడీకి తెరతీశాయి.

- పై తరగతికి ప్రమోట్ చేయాలంటే రూ.5 వేలు అడ్వాన్స్ ఫీజు డిమాండ్
- ఆ తరగతి ఫీజులో 10–20 శాతం రాయితీ ఇస్తామంటూ ఫోన్లు
- అయోమయంలో తల్లిదండ్రులు
- ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా పెరుగుతున్న ప్రవేశాలు
- విద్యార్థులను నిలువరించేందుకు ప్రయత్నాలు



నెల్లూరుకు చెందిన సుబ్బారావు (పేరు మార్పు) కుమారుడు ఓ కార్పొరేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. 'వచ్చే విద్యా సంవత్సరంలో మీ అబ్బాయిని పైతరగతికి ప్రమోట్ చేయాలంటే ఇప్పుడే రూ.5 వేలు చెల్లించాలి. వచ్చే ఫీజులో కూడా 10 నుంచి 20 శాతం రాయితీ ఇస్తాం. పాఠశాలల పునః ప్రారంభం తర్వాత అయితే నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.' అంటూ ఆ పాఠశాల యజమాన్య సిబ్బంది సుబ్బారావుకు ఫోన్ చేశారు. ఒక్క సుబ్బారావుకే కాదు.. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు వారం రోజులుగా యాజమాన్యాలు, సిబ్బంది నుంచి ఫోన్లు వస్తున్నాయి.

నెల్లూరు (టౌన్): జిల్లాలో 720 కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1.80 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఒక్కో కార్పొరేట్ యాజమాన్య పరిధిలో జిల్లాలో పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు ఉన్నాయి. ఇన్నాళ్లు కార్పొరేట్ చదువుల పేరుతో విద్యను వ్యాపారంగా మార్చేసి ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ విద్యావిధానంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టడంతో ప్రభుత్వ పాఠశాలలకు డిమాండ్ పెరిగింది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల నుంచి టీసీలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు.

కోర్సును బట్టి రూ.లక్షల్లో ఫీజులు

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో కొత్త కొత్త కోర్సులు తెరపైకి తీసుకు వచ్చి విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్, ఐఐటీ, నీట్ పేరుతో ఫీజును అమాంతంగా పెంచేస్తున్నారు. పాఠశాలను బట్టి తరగతిలో ఆయా కోర్సును బట్టి రూ.20 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజుతో పాటు పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం తదితర వాటికి అదనంగా మరో రూ.10 నుంచి 15 వేలు పిండుతున్నారు. ఖర్చులు పెరిగాయన్న కారణం చెప్పి ఏటా ప్రస్తుత ఫీజుకు అదనంగా 20 శాతం ఫీజును పెంచుతున్నారు. దరఖాస్తుకు రూ.500 నుంచి రూ.1000 వసూలుతో ప్రారంభమవుతున్న వీరి దోపిడీకి అంతం లేకుండా పోతోంది.

విద్యార్థులు వెళ్లిపోకుండా..

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో కొత్తగా అడ్మిషన్లు ఉండడం లేదు. మరో వైపు అక్కడ చదువుతున్న విద్యార్థులు సైతం టీసీలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు. వెళ్లిపోతున్న విద్యార్థులను నిలుపుకునేందుకు ప్రైవేట్ యాజమాన్యాలు రకరకాల ఎత్తులు వేస్తున్నారు. ఇప్పటికే పాఠశాలల సిబ్బంది పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల వైపు వెళ్లకుండా ఉండేందుకు నానా తంటాలు పడుతున్నారు. రానున్న విద్యాసంవత్సరంలో మీ పిల్లవాడిని పైతరగతికి ప్రమోట్ చేయాలంటే ఇప్పుడే కోర్సును బట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేలు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఫీజులో కూడా 10 నుంచి 20 శాతం రాయితీ ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నారు. ఆ తర్వాత నిర్ణయించిన ఫీజులో ఒక్క రూపాయి కూడా తగ్గించే పరిస్థితి ఉండదని తెగేసి చెబుతున్నారు. ప్రధానంగా నారాయణ, శ్రీచైతన్య, రత్నం, ఓవెల్, భాష్యం తదితర పాఠశాలల నుంచి ప్రతి రోజూ వారి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు వస్తున్నాయి. టీసీ తీసుకునే పరిస్థితి వస్తే ప్రమోట్ చేయమని బెదిరిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు అయోమయంలో పడి తల్లిడిల్లుతున్నారు. టీసీ తీసుకుంటే.. ఒక సంవత్సరం వృథా అవుతుందని, అక్కడే చదివించాలంటే.. ఫీజులు భారం ఎలా భరించేదని దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

పట్టించుకోని విద్యాశాఖ

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలు తెలిసినా విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు అడ్మిషన్లు, ప్రమోట్ పేరుతో వసూళ్లు, అధిక ఫీజుల దందాలు కొనసాగిస్తున్నా.. ఎక్కడా ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీ చేసిన సందర్భాలు కనిపించడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల వివరాలు డిస్‌ప్లే చేయాలన్న నిబంధన ఉన్నా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. కొన్ని యాజమాన్యాలు ఫార్మేటివ్, సమ్మేటివ్, ప్రీ ఫైనల్ పరీక్షలను ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా నిర్వహించుకుంటున్నాయి. ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, డీఈఓ ఉన్నా పర్యవేక్షణ కొరవడడంతో ప్రైవేట్ యాజమాన్యాల దోపిడీ మితిమీరుతోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ చదువులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా నవీకరిస్తూ.. అంతకు మించి ఉన్నత ప్రమాణాలతో కూడిన చదువులకు శ్రీకారం చుట్టింది. నాడు–నేడుతో తొలివిడతలో 1,059 పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సకల సౌకర్యాలు కల్పించారు. రెండో విడతలో మరో 1,120 పాఠశాలలు మే నాటికి కొత్త రూపురేఖలు సంతరించుకున్నాయి. వసతుల్లోనే కాకుండా విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ చదువులకు బైజుస్‌తో ఒప్పందాలు చేసుకుంది. ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు పౌష్టికాహారంతో కూడిన జగనన్న గోరుముద్ద అందిస్తోంది. ప్రభుత్వ బడుల్లో చదివించే తల్లిదండ్రులకు అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరుగుతోంది. ఇది కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలకు తలనొప్పిగా మారింది.

ప్రమోట్ పేరుతో వసూళ్లు చేస్తే చర్యలు



ప్రమోట్ పేరుతో డబ్బులు వసూళ్లు చేస్తే ఆ పాఠశాల యాజమాన్యంపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఎవరూ ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదు. జిల్లాలో ఏ యాజమాన్యం అయినా ఇలా ఫోన్ చేసి బెదిరిస్తే.. మా దృష్టికి తీసుకురండి. ముందస్తు అడ్మిషన్లు కూడా చేయకూడదు. పాఠశాలల పునః ప్రారంభం తర్వాతే అడ్మిషన్లు చేయాలి. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– గంగాభవాని, డీఈఓ

సోమశిలలో 60.571 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం నాటికి 60.571 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2100, ఉత్తర కాలువకు 673, దక్షిణకాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 98.085 మీటర్ల మట్టం నమోదైంది.

ప్రతిభకు వేదిక


పరుగుపందేనికి సిద్ధంగా..

- అథ్లెట్స్‌గా రాణించేందుకు ఆసక్తి
- శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు, యువత

క్రీడల్లో అథ్లెటిక్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. కఠోర శ్రమతో ఎంతోమంది విజయాలు సాధించారు. వ్యక్తిగతంగా పేరు, ప్రతిష్టలు సంపాదించారు. చిన్నతనంలో అనేక కష్టాలు పడిన ఓ కోచ్ నేడు విద్యార్థులకు, యువతకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రీడాకారులకు వేదికగా నిలుస్తోంది.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అథ్లెటిక్స్ సాధన చేసే వారితో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సందడిగా మారిపోతుంది. ఇక్కడ కోచ్ అన్నామలై రజనీకాంత్ వివిధ వయసులకు చెందిన 45 నుంచి 55 మందికి బృందాలుగా శిక్షణ ఇస్తుంటారు. 100, 200, 400 మీటర్ల పరుగు పందేలు, లాంగ్‌జంప్, హై జంప్, త్రోబాల్‌తోపాటు మిగిలిన అంశాల్లో సాధన చేయిస్తుంటారు. పోలీసులకు సంబంధించి ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం వచ్చే వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తుంటాడు. తాను కోచ్ కాకముందు నుంచే అథ్లెట్‌గా నెల్లూరు స్టేడియంతో అనుబంధం ఉండటం ప్రత్యేకత. స్వతహాగా జాతీయ స్థాయి అథ్లెట్, మూడుసార్లు బాడీ బిల్డింగ్‌లో మిస్టర్ ఆంధ్రా టైటిల్‌ను గెలుచుకున్న రజనీకాంత్ ఎందరో అథ్లెట్‌లను తీర్చిదిద్దారు.


బాడీ బిల్డింగ్ పోటీల్లో రజనీకాంత్ (ఫైల్)



తొలుత అథ్లెట్‌గా..

రజనీకాంత్‌ను చిన్నతనంలో ఆర్థిక సమస్యలు వెంటాడాయి. అయినా పట్టు వదలకుండా క్రీడా రంగంలో, విద్యలో ఉన్నత స్థాయికి ఎదిగారు. 1994లో స్కూల్లో ఫీజు కట్టలేని పరిస్థితుల్లో యాజమాన్యం అతన్ని స్కూల్ నుంచి పంపేసింది. అయితే అప్పటి పీఈటీ అంకులయ్య రజనీకాంత్‌లోని క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి యాజమాన్యంతో మాట్లాడి ఖోఖో, అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. 1999లో గ్రిగ్స్ పోటీల్లో జిల్లా స్థాయిలో చాంపియన్ షిప్ సాధించారు. క్రికెట్‌లో సైతం రాణించడంతో క్రీడ లకు మరింత చేరువయ్యారు. 2000లో రూరల్ నేషనల్స్‌లో 100 మీటర్లు, లాంగ్‌జంప్‌లో ప్రతిభ చూపారు. అలా ఏడుసార్లు జాతీయ స్థాయి పతకాలు, సౌతిండియా సిల్వర్ మెడల్‌ను సాధించారు. అలాగే బాడీ బిల్డింగ్‌లో సైతం రాణించారు. మూడుసార్లు మిస్టర్ ఆంధ్రా టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. అనంతరం సర్వోదయ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి 2013లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి ఎన్‌ఐఎస్ సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసి కోచ్‌గా అర్హత సాధించారు.

కోచ్‌గా..

అథ్లెట్‌గా, బాడీ బిల్డర్‌గా, ప్లేయర్‌గా రాణిస్తున్న రజనీకాంత్‌ను 2014లో చీఫ్ కోచ్ యతిరాజ్, ఖోఖో అసోసియేషన్ నాయకుడు విజయ్ కుమార్ గమనించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అథ్లెటిక్ కోచ్‌గా దరఖాస్తు చేసుకోమని సలహా ఇచ్చారు. ఇందుకు అప్పటి కలెక్టర్ శ్రీకాంత్ సహకరించారు. దీంతో కోచ్‌గా స్టేడియంలో శిక్షణ ప్రారంభించారు. లాస్ ఆఫ్ పే కింద గ్వాలియర్‌లో డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోర్సును చేశారు. ఐఏఏఎఫ్ (ఇంటర్నేషనల్ అమెచ్యూర్ కోచింగ్ ఎలిజిబుల్ అథ్లెటిక్ ఫెడరేషన్) -లెవల్ 2ను పూర్తి చేశారు. దీంతో అంతర్జాతీయ పోటీలకు కోచ్‌గా, అంపైర్‌గా అర్హత సాధించారు. ఇలా ఆయన స్ఫూర్తిని పలువురిలో నింపి సాధారణ వ్యక్తులను అథ్లెట్లుగా తీర్చిదిద్దుతున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు



నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నేర్చుకున్న అంశాలు ఎంతో ఉపయోగపడ్డాయి. మూడు సార్లు అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లా. హాంకాంగ్, కెన్యా, నేపాల్‌లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఇక్కడి సాధనతో ఎంతో గుర్తింపు తెచ్చింది.

– షణ్ముగ శ్రీనివాస్, అథ్లెట్

రాష్ట్రస్థాయిలో ప్రతిభ



నెల్లూరు కేఎన్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నా. మా నాన్న కానిస్టేబుల్. స్టేడియానికి వచ్చిన ఆరు నెలల్లోనే డిస్కస్ త్రోలో సాధన చేసి స్టేట్ లెవల్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాను. రాబోయే రోజుల్లో మంచి అథ్లెట్‌గా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటా.

– జి.బ్యూలా, అథ్లెట్

సాధనతోనే అవకాశాలు

నిరంతర సాధనతోనే అథ్లెట్స్‌కు అవకాశాలు వస్తుంటాయి. చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలు అనుభవించా. నా గెలుపులో భార్య కుప్పమ్మ ప్రోత్సాహం ఎంతో ఉంది. అథ్లెట్స్ నిరంతర సాధన చేసేందుకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను. మరింత మందిని ఉన్నత అథ్లెట్స్‌గా తీర్చిదిద్దుతా.

– రజనీకాంత్, అథ్లెటిక్స్ కోచ్

అథ్లెటిక్స్ శిక్షణ టైమింగ్స్ :

ఉదయం 5.30 నుంచి 8.30 వరకు..
సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు..
అథ్లెటిక్స్ కోచ్ ఫోన్ నంబర్ : 99661 92017
చీఫ్ కోచ్ ఫోన్ నంబర్ : 91211 06835

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 104
లేయర్ (లైవ్) : 75
బ్రాయిలర్ చికెన్ : 186
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 206
లేయర్ చికెన్ : 128

పొదలకూరు



నిమ్మధరలు (కిలో)
పెద్దవి : రూ.82
సన్నవి : రూ.70
పండ్లు : రూ.40

క్లుప్తంగా

ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు కృషి చేశా

- కె.శ్రీలక్ష్మి



నెల్లూరు(క్రైమ్): 'జిల్లాలో ఇసుక, మద్యం అక్రమరవాణా, అనధికార విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు సెబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశా.' అని జిల్లా సెబ్ అధికారిణిగా పనిచేసి చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన కె.శ్రీలక్ష్మి వెల్లడించారు. ఆమె శుక్రవారం నెల్లూరులో ఎస్పీ సీహెచ్ విజయారావును పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు, సిబ్బంది సహకారంతో రెండేళ్లపాటు జిల్లాలో సమర్థవంతంగా విధులు నిర్వహించి నేరాలను కట్టడి చేశానని తెలిపారు. పొరుగు మద్యం విక్రయాలపై పెద్ద ఎత్తున దాడులు చేశామన్నారు. గంజాయి కేసుల్లో మూలాలను గుర్తించి సరఫరాదారులను జైలుకు పంపామన్నారు. పదేపదే నేరాలకు పాల్పడుతున్న సుమారు 70 మందిపై సస్పెక్టెడ్ షీట్లు తెరిచామన్నారు. నాటుసారాపై ఆధారపడి జీవిస్తున్న వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఎస్పీల సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 40కి పైగా కుటుంబాలకు రుణాలు ఇప్పించి వారు సమాజంలో గౌరవంగా జీవించేలా చేశామన్నారు.

వేరే జిల్లాకు బదిలీ కాకుండా..

- నకిలీ ధ్రువీకరణపత్రం సమర్పించిన ఉద్యోగి సస్పెన్షన్

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్య శాఖలో పదోన్నతి కోసం ఓ ఉద్యోగిని నకిలీ ధ్రువీకరణ పత్రం సమర్పించి సస్పెండ్ అవడం కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులో వైద్యారోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సునీత, మన్మాదాపురం పీహెచ్‌సీలో పనిచేస్తున్న కనకరత్నం డిప్యూటీ డెమోగా ఈనెలలో పదోన్నతి పొందే జాబితాలో ఉన్నారు. ఈ క్రమంలో వేరే జిల్లాకు బదిలీ అయ్యే అవకాశం ఉందని, నెల్లూరులో ఖాళీగా ఉన్న డిప్యూటీ డెమో పోస్టు కోసం సునీత నకిలీ ధ్రువీకరణపత్రాన్ని జత చేశారు. వాస్తవానికి ఆమె భర్తకు మొదటి భార్య, కుటుంబం ఉంది. అతను 2011లో కొడవలూరులో మరణించగా మొదటి భార్య అక్కడ పంచాయతీ కార్యాలయం ద్వారా మరణ ధ్రువీకరణపత్రం పొందారు. అయితే సునీత తన భర్త నెల్లూరులోని మనుమసిద్ధినగర్‌లో ఇంటి వద్ద మరణించినట్లు కార్పొరేషన్ నుంచి డెత్ సర్టిఫికెట్‌ను తెచ్చి అందజేశారు. దీనిపై మరో ఉద్యోగి నుంచి వైద్య శాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ జరిపించారు. ఆమె సర్టిఫికెట్ నకిలీదని తేలడంతో సస్పెండ్ చేశారు.

ఒక్కొక్కరిపై ఎన్నో కేసులు

- నగదు దోచుకెళ్లిన కేసులో నిందితులు 25 ఏళ్లలోపు వారే..
- నలుగురిపై ఇప్పటికే సస్పెక్టెడ్ షీట్లు, ఒకరిపై రౌడీషీట్
- జైలుకు పంపినా మారలేదు
- కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీస్ శాఖ కసరత్తు

నెల్లూరు(క్రైమ్): వారి వయసు 20 నుంచి 25 ఏళ్ల లోపే.. వ్యసనాలు అందరినీ నేరాల వైపునకు మళ్లించాయి. దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడుతూ పలుమార్లు పోలీసులకు చిక్కి జైలుపాలయ్యారు. బయటకు వచ్చినా వారి తీరులో మార్పురాలేదు. యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇటీవల ఓ వ్యక్తిపై దాడి చేసి నగదు దోచుకెళ్లిన ఘటనలో నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో అనేక విషయాలు వెలుగు చూశాయి. నిందితులు ముఠాగా ఏర్పడి మద్యం, సొల్యూషన్, గంజాయి మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. కౌన్సెలింగ్ ఇచ్చినా మారలేదు. నేరాలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని కఠినంగా వ్యవహరిస్తామని ఇప్పటికే ఎస్పీ సీహెచ్ విజయారావు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో నిత్యం వీరిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీస్ అధికారులు సిద్ధమయ్యారు. అందులో భాగంగా ఇప్పటికే సదరు వ్యక్తులపై ఎన్ని కేసులున్నాయి?, ఏ నేరాలకు పాల్పడ్డారు? తదితర వివరాలను సేకరించారు.

వారిపై కేసులిలా..

- నెల్లూరు నగరంలోని కుసుమహరిజనవాడకు చెందిన మందా మల్లిపై నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అదే స్టేషన్ పరిధిలో హత్య, దొంగతనం, సంతపేట పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనం కేసులున్నాయి.
- తడికలబజారు సెంటర్‌కు చెందిన పి.ప్రణయ్‌కుమార్ అలియాస్ రాముపై చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉంది. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడసాగాడు. చిన్నబజారు స్టేషన్ పరిధిలో దోపిడీ, కొట్లాట, సంతపేటలో దోపిడీ, నవాబుపేటలో హత్య, దర్గామిట్ట స్టేషన్ పరిధిలో కొట్లాట, వేదాయపాళెం, గుంతకల్ రైల్వేలో దొంగతనం కేసులున్నాయి.
- కుసుమహరిజనవాడకు చెందిన కన్నయ్య అలియాస్ కన్నాపై చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉంది. 2019 నుంచి నేరాలకు పాల్పడుతున్నాడు. చిన్నబజారు స్టేషన్‌లో హత్యాయత్నం, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసు, బాలాజీనగర్‌లో మరో కేసు ఉంది.
- నెల్లూరు బోడిగాడితోట (ప్రస్తుతం హౌసింగ్‌బోర్డులోని ఆర్డీడీ కాలనీ)కి చెందిన అరవ యూనీస్‌పై చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉంది. కావలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆమెపై దోపిడీ కేసు, చిన్నబజారు స్టేషన్‌లో రెండు కేసులున్నాయి.
- నెల్లూరు హౌసింగ్‌బోర్డులోని ఆర్డీడీ కాలనీకి చెందిన అరవ కాళీపై చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉంది. అదే స్టేషన్‌లో దోపిడీ కేసు ఉంది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

కందుకూరు: పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ శోభిక, డీఎస్పీ కండే శ్రీనివాసులు, ఇతర అధికారులు శుక్రవారం పరిశీలించారు. భద్రతా చర్యలు, ట్రాఫిక్ తదితర అంశాల గురించి ఆరాతీశారు. ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సీఐ వెంకట్రావ్, తహసీల్దార్ సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

- గుడ్లూరు: స్థానికజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ శోభిక శుక్రవారం పరిశీలించారు. రెండు కేంద్రాలు పట్టభద్రుల ఓటర్లకు, ఒక కేంద్రం ఉపాధ్యాయ ఓటర్లకు కేటాయించినట్లు తెలిపారు. పాఠశాలలో గదులు అపరిశుభ్రంగా ఉండటంతో హెచ్ఎం రామ్మోహన్‌రావుపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్య నారాయణసింగ్, ఎస్సై ప్రసాద్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖకు టైర్ల వితరణ


డీఎఫ్‌ఓకు టైర్లు అందజేసిన ఐఎఫ్ఎఫ్ కంపెనీ ప్రతినిధులు

నెల్లూరు(క్రైమ్): శ్రీసిటీలోని ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్‌రెన్స్ (ఐఎఫ్ఎఫ్) కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.7 లక్షల విలువ చేసే టైర్లను జిల్లా అగ్నిమాపక శాఖకు వితరణ చేసింది. ఆ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో డీఎఫ్ఓ కె.శ్రీకాంత్‌రెడ్డికి 29 టైర్లను అందజేశారు. వేసవి దృష్ట్యా ఫైర్ ఇంజన్లను పూర్తి కండీషన్‌లో ఉంచేందుకు తమవంతుగా సీఎస్ఆర్ నిధుల కింద టైర్లను అందజేశామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.కార్యక్రమంలో నెల్లూరు ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ హరిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో హుండీ కానుకల లెక్కింపు

వలేటివారిపాలెం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మాలకొండలో 18 వారాలకు సంబంధించి హుండీలోని కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,04,84,868 వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. యూఎస్ఏ డాలర్లు 72, యూరోస్ 175 తదితర దేశాల కరెన్సీ, బంగారం 285 గ్రాములు, వెండి 1.940 కేజీలు వచ్చాయని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారులుగా వై.బైరాగి, వీవీఎల్ రవీంద్రనాథ్ వ్యవహరించారు.

కుక్కల దాడిలో 15 మేకపిల్లలు మృతి


మృతిచెందిన మేకపిల్లలు


బాధితుడు ధర్మయ్య

సంగం: కుక్కలు దాడి చేయడంతో 15 మేకపిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని పెరమనలో శుక్రవారం వేకువజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పెరమనకు చెందిన వన్నె ధర్మయ్యకు భార్య, ఐదుగురు పిల్లలున్నారు. అతను మేకపిల్లలను కొనుగోలు చేసి పెంచి విక్రయిస్తుంటాడు. ఇటీవల 24 మేకపిల్లలను కొనుగోలు చేసి ఇంటికి సమీపంలో ఉంచాడు. శుక్రవారం వేకువజామున వీధి కుక్కలు దాడి చేసి 15 మేకపిల్లలను చంపేశాయి. 9 మేకపిల్లలు పారిపోయాయి. ఉదయం ధర్మయ్య చనిపోయిన మేకపిల్లలను చూసి కన్నీరుమున్నీరయ్యాడు. మిగిలిన వాటి కోసం వెతకగా నాలుగు దొరికాయి. ఇటీవలే రూ.1.50 లక్షల అప్పు చేసి మేకపిల్లలను కొన్నానని, అవి చనిపోవడంతో అప్పు ఎలా తీర్చాలని ధర్మయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

క్లుప్తంగా

ఊడిన స్క్రాప్ బస్సు చక్రం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఒకటో డిపోకు సంబంధించిన స్క్రాప్ బస్సును కాకుటూరులోని గ్యారేజీకి తరలిస్తుండగా, కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద చక్రం నడిరోడ్డుపై ఊడిపోయింది. విషయాన్ని గమనించిన సిబ్బంది వెంటనే బస్సును ఆపి చక్రాన్ని బిగించారు.

ఎమ్మెల్‌హెచ్‌పీలకు శిక్షణ



నెల్లూరు (అర్బన్): ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు సేవాభావంతో వైద్యసేవలను అందించాలని వైద్య ఆరోగ్య శాఖ మాస్టర్ ట్రెయినర్ డాక్టర్ రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. నూతనంగా విధుల్లో చేరిన ఎమ్మెల్‌హెచ్‌పీలకు శిక్షణ కార్యక్రమాన్ని సంతపేటలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. నాణ్యమైన వైద్యాన్ని అందించే అంశమై సూచనలు చేశారు.

నియామక ఉత్తర్వుల అందజేత

నెల్లూరు (వేదాయపాళెం): కాపునాడు నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడిగా సంపత్ హనుమంతరావును నియమించారు. విజయవాడలో కాపునాడు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియామక ఉత్తర్వులను కాపుల జాతీయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అందజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని జిల్లా టీబీ కార్యాలయం వద్ద పలువురు రోగులకు పౌష్టికాహారం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. టీబీ ముక్త భారత్ ద్వారా ఆర్నెల్ల పాటు వీటిని ఉచితంగా అందజేయనున్నామని టీబీ జిల్లా నివారణాధికారి వెంకటప్రసాద్ పేర్కొన్నారు.

పెద్దాస్పత్రిలో తనిఖీలు



నెల్లూరు (అర్బన్): ప్రభుత్వ పెద్దాస్పత్రిని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు జాయింట్ డైరెక్టర్ రామన్, డాక్టర్ ప్రేమ్, తదితరులతో కూడిన ఐదుగురు డాక్టర్ల బృందం శుక్రవారం తనిఖీ చేసింది. పెద్దాస్పత్రిలోని సమస్యలపై మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు కలెక్టర్ చక్రధర్‌బాబు ఇటీవల వివరించారు. దీంతో తనిఖీల నిమిత్తం అధికారులను పంపారు. థియేటర్లు, పారిశుధ్యం, చిన్నపిల్లల వార్డు, ఓపీ వార్డు, గైనకాలజీ, పల్మనాలజీ, మానసిక, తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కొరత ఉన్న మెడికల్ పరికరాలు, పరీక్షలను గుర్తించారు. నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపనున్నారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, ఆర్ఎం కళారాణి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, గైనకాలజీ విభాగ ఇన్‌చార్జి అరుణ్ కుమార్, డాక్టర్ మస్తాన్‌బాషా పాల్గొన్నారు.

నారీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలకు అవార్డులను అందజేయనున్నామని జీవన్ యోగాశాల ఆరోగ్య సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసన్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో నారీ పురస్కారాలను ఈ నెల తొమ్మిదో తేదీన అందజేయనున్నామని చెప్పారు. వివరాలకు 93914 91052 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

- అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన ఎనిమిది మందికి ఆదర్శ మహిళా పురస్కారాలను నగరంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో ఈ నెల ఏడున అందజేయనున్నామని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు పేర్కొన్నారు.

ఇరిగేషన్ పనులను పరిశీలించండి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

నెల్లూరు(పొగతోట): ఇరిగేషన్‌కు సంబంధించి గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్ ఆదేశించారు. నగరంలోని జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయంలో కమిటీ సభ్యులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కమిటీల్లో ఉన్న అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు, నాణ్యత, తదితర వివరాలతో నివేదికలను అందజేయాలని సూచించారు.

ఈ - క్రాప్‌తో రైతులకు ఆసరా

- రూరల్ నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రక్రియ
- 14 వేల ఎకరాల్లో పూర్తయిన నమోదు

నెల్లూరు రూరల్: వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తూ రైతులకు చేయూతనందిస్తోంది. పంటలకు సంబంధించిన ఈ - క్రాప్ నమోదు ప్రక్రియను రెండేళ్లుగా చేపడుతోంది. ఏదైనా సందర్భాల్లో పంట నష్టం జరిగితే రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుత రబీ సీజన్లో నెల్లూరు రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో 15 వేల ఎకరాల్లో వరి, వందెకరాల్లో పత్తి, 40 ఎకరాల్లో వేరుశనగ, మినుము, ఇతర పంటలను సాగుచేస్తున్నారు. ఈ క్రమంలో ఈ - క్రాప్ నమోదు ప్రక్రియను వ్యవసాయాధికారులు వేగవంతం చేస్తున్నారు. 14 వేల ఎకరాల్లో నమోదు ప్రక్రియ పూర్తయింది. పంటల నమోదుతో పాటు ఈ - కేవైసీ ప్రక్రియనూ చేపడుతున్నారు.



ఈ - క్రాప్‌ను నమోదు చేస్తున్న అధికారులు



రైతుల నుంచి ఈ - కేవైసీ సేకరణ

నమోదిలా..

- ఈ - క్రాప్ ప్రక్రియలో తొలుత రైతులకు చెందిన పొలాల వద్ద వ్యవసాయ శాఖ సహాయకులు ఆయా పంటలను నమోదు చేస్తారు. అనంతరం వ్యవసాయ శాఖ సహాయకులు, వీఆర్వోలు, రైతులతో మూడు దశల్లో ఈ - కేవైసీ పద్ధతిని పూర్తి చేస్తారు.
- ఈ - క్రాప్ నమోదు, ఈ - కేవైసీ ప్రక్రియల అనంతరం ఆయా ప్రాంతాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద రైతుల పేర్లు, పంటల వివరాలను ప్రకటిస్తారు. వీటిలో ఏమైనా లోటుపాట్లు ఉంటే వారంలోపు అభ్యంతరాలను రైతులు తెలియజేయాల్సి ఉంటుంది. అనంతరం వీటిని సవరిస్తారు.
- సవరణల అనంతరం సూపర్‌చెక్ విధానం ద్వారా ఆన్‌లైన్లో పొందుపర్చిన నివేదికలపై వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పొలాలకు సంబంధించిన సర్వే నంబర్లు, పంటల వివరాలను పరిశీలిస్తారు. పరిశీలనలో సైతం ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని సమగ్రంగా విచారించి పూర్తి స్థాయి నివేదికలను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు పంపుతారు.

ఎన్నో ఉపయోగాలు

ఈ - క్రాప్ నమోదుతో రైతులకు పలు ఉపయోగాలు కలుగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటలకు నష్టం సంభవిస్తే పంటల బీమా వర్తిస్తుంది. ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ లభిస్తుంది. రైతులకు అవసరమైన విత్తనాలతో పాటు పంట నష్టానికి పరిహారాన్ని అందిస్తారు. తమకు అండగా నిలుస్తున్న ఈ - క్రాప్ నమోదుపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పీఎం కిసాన్, రైతు భరోసా పథకాల ద్వారా ఏటా లబ్ధి పొందుతున్నాను. పంటలు వేసి ప్రతిసారి ఈ - క్రాప్ నమోదును తప్పక చేయించుకుంటున్నా.

\- శంకరయ్య, రైతు, సౌత్‌మోపూరు

ఈ - క్రాప్‌తో లబ్ధి



రైతులను ఆదుకునేందుకు ఈ - క్రాప్ నమోదును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ - క్రాప్‌ను రైతులు నమోదు చేయించుకుంటున్నారు. పంటలకు నష్టం వాటిల్లినప్పుడు ప్రభుత్వం తగిన విధంగా పరిహారాన్ని చెల్లిస్తోంది.

\- శ్రీకాంత్‌రెడ్డి, రైతు, పొట్టేపాళెం

ప్రతిసారి నమోదు చేయించుకుంటున్నా



పంటను సాగుచేసిన ప్రతిసారి ఈ - క్రాప్‌ను నమోదు చేయించుకుంటున్నా. ఎన్ఎల్ఆర్ 34449 రకం వరిపైరును తొమ్మిదెకరాల్లో సాగుచేశా. పీఎం కిసాన్, రైతు భరోసా పథకాల లబ్ధిని పొందుతున్నా. పంట నష్టం ఏర్పడిన సమయంలో ఈ - క్రాప్ ఎంతో చేయూతగా ఉంటోంది.

\- సునీల్, కొండ్లపూడి

ఎంతో ఉపయోగం



ఈ - క్రాప్ నమోదు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుత రబీ సీజన్లో ముమ్మరంగా నమోదు చేస్తున్నాం. త్వరలో పూర్తిస్థాయిలో నమోదు పూర్తికానుంది. పంటలకు నష్టం జరిగిన సమయంలో పరిహారంతో పాటు విత్తనాలను సైతం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తాం.

\- నాగమోహన్, రూరల్ మండల వ్యవసాయాధికారి

దళితుల భూములను ఆక్రమిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న సుబ్బయ్య

నెల్లూరు రూరల్: అంబాపురంలో దళితులకు చెందిన 12 ఎకరాలను స్థానిక విశ్రాంత వీఆర్వో ఆక్రమించారని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య ఆరోపించారు. అంబాపురంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. స్థానిక దళితులకు భూములను ఎన్నో ఏళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. దళితుల భూముల్లో లేఅవుట్‌ను వేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నేతలు రఘు, చిన్నయ్య, కామేష్, వెంకట్రావ్, గురవయ్య, సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.

రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: పేదలందరికీ గృహాలను అందజేసే ప్రక్రియలో భాగంగా లబ్ధిదారులకు రూ.10 కోట్ల రుణాలను బ్యాంకుల ద్వారా ఈ నెల 25లోపు మంజూరు చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన అన్ని గృహాలను విడతల వారీగా లబ్ధిదారులకు స్వాధీనం చేయాలన్నారు. టిడ్కో గృహాలతో పాటు జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మెప్మా పీడీ రవీంద్ర, టిడ్కో ఈఈ ఉమాశంకర్‌శాస్త్రి, కార్పొరేషన్ టీపీఆర్వో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి తీరు సిగ్గుచేటు



మాట్లాడుతున్న మత్స్యకారులు

నెల్లూరు(సెంట్రల్): గ్రామ కంఠంలో సాగు చేసుకుంటున్న రొయ్యల గుంతలను అటవీ అధికారులు తొలగించారంటూ టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నానా యాగీ చేయడం సిగ్గుచేటని మత్స్యకారులు విమర్శించారు. మాగుంట లేఅవుట్లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు, తోటపల్లిగూడూరు మండలం వెంకటేశ్వరపాళేనికి చెందిన పలువురు మత్స్యకారులు మాట్లాడారు. వందెకరాల అటవీ భూములను గ్రామ కంఠాలుగా ఆక్రమించి తాయిలాలిచ్చే బడాబాబులకు సోమిరెడ్డి ధారాదత్తం చేశారని మండిపడ్డారు. కోర్టులో ఉండే అంశాలపై మాట్లాడటం తగదన్నారు. గ్రామ కంఠం భూముల్లో రొయ్యల సాగును చేపట్టొచ్చాననే విషయమై సోమిరెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆరోపణలను మానుకోకపోతే తగిన బుద్ధి చెప్తామని స్పష్టం చేశారు. పెద్దకాపు శ్రీనివాసులు, తిరుపతయ్య, అర్జున్, కోటి, దుర్గ, రామలక్ష్మమ్మ, వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓస్ మహిళా విభాగ కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు (అర్బన్): ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా మహిళా కార్యవర్గాన్ని దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మహిళా ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా చైర్‌పర్సన్‌గా చిన్నమ్మ, కో చైర్‌పర్సన్‌గా శకుంతల, వైస్ చైర్‌పర్సన్లుగా నవోదయ, మమత, ఇందు, కిష్టమ్మ, విజయభారతిని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా శారద, కో కన్వీనర్‌గా వాణి, జాయింట్ కన్వీనర్లుగా లక్ష్మి, భవాని, రాధా, దివ్య, తేజ, విజయపద్మ, కోశాధికారిగా సమతను నియమించారు. ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెంచలరావు, వెంకటస్వామి, నేతలు వెంకటేశ్వర్లు, ఆంజనేయవర్మ, కరుణమ్మ, పెంచలయ్య, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉభయదేవేరులతో రంగనాథుడు మాడవీధుల్లో విశేషాలంకారంలో విహరించారు. శేషవాహనసేవలో రాత్రి దర్శనమిచ్చారు. కాగా సూర్యప్రభ, హంస వాహనసేవలను శనివారం నిర్వహించనున్నారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.





నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జగదీష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఈస్ట్ - 2 సెక్షన్ ఏఈ ప్రసాద్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీనగర్, గౌడ హాస్టల్, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్ఈబీ జిల్లా అధికారి

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ విజయారావును నగరంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్ఈబీ జిల్లా అధికారి శ్రీనివాసాచారి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పరిపాలనపరమైన విషయాలు, నేర నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై ఏఎస్పీ హిమవతి, శ్రీనివాసాచారితో ఎస్పీ చర్చించారు. నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎస్ఈబీ, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

న్యాయం చేయాలని శానిటరీ సిబ్బంది వినతి

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో పనిచేస్తున్న తమకు జీతాలను ఏజెన్సీ తగ్గించిస్తోందని శానిటరీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌కు సమస్యను శుక్రవారం వారు తెలియజేశారు. ఈ క్రమంలో ఏజెన్సీ నిర్వాహకులతో ఆర్ఎంఓ కళారాణి మాట్లాడారు. శానిటరీ వర్కర్లు బయోమెట్రిక్ వేయకపోవడంతో సమస్య వస్తోందని ఏజెన్సీ నిర్వాహకుల ప్రతినిధి కొండయ్య బదులిచ్చారు. తగ్గించిన జీతాన్ని త్వరలో అందజేయాలని ఆర్ఎంఓ ఆదేశించారు. లత, నాగమ్మ, శీనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కారుకు పూజ చేయించుకెళ్తూ..

- డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): కారుకు పూజ చేయించుకొని కొండాయపాళెం గేట్ వద్ద రోడ్డు దాటే క్రమంలో బ్రేక్ బదులు ఎక్సలరేటర్ నొక్కడంతో డివైడర్‌ను ఢీకొంది. ఘటనలో కారులోని వ్యక్తి గాయపడ్డారు. ప్రమాదంతో ట్రాఫిక్ స్తంభించింది. క్షతగాత్రుడ్ని స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది.

లిఫ్ట్ అడిగి కారుతో ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్): లిఫ్ట్ అడిగి కారుతో ఇద్దరు దుండగులు ఉడాయించిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. రాంజీనగర్‌లో నివాసం ఉంటున్న శంకరయ్య తన హోండా కారును వ్యాపార పనుల నిమిత్తం డ్రైవర్ శ్రీనివాసులురెడ్డికి ఇచ్చి నాయుడుపేట పంపారు. అక్కడ పనులు ముగించుకొని నెల్లూరు బయల్దేరారు. వెంకటాచలం సమీపంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు నెల్లూరు వరకు లిఫ్ట్ ఇవ్వాలని కోరగా, డ్రైవర్ వారిని ఎక్కించుకున్నారు. నగరంలోని పూలే విగ్రహ సమీపంలో గల అలేఖ్య స్వీట్స్ వద్ద కారును ఆపి డ్రైవర్ వెళ్లారు. తాళాలను కారులోనే మర్చిపోవడంతో, అదునుగా భావించిన దుండగులు వాహనంతో ఉడాయించారు. విషయాన్ని యజమానికి డ్రైవర్ తెలియజేశారు. శంకరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత నేరస్తుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో దోపిడీకి పాల్పడి పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఐదుగురు పాత నేరస్తులను చిన్నబజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబుతో కలిసి నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కొండాయపాళెం గేట్ ప్రాంతానికి చెందిన మాఘలింగం మణి తన భార్య, కుమార్తెతో కలిసి కొత్తహాల్‌కు గత నెల 24వ తేదీ సాయంత్రం వెళ్లారు. ఇంటర్వెల్ సమయంలో కూల్‌డ్రింక్స్ తీసుకొని భార్య కుమార్తెకు ఇచ్చి.. నీరు తాగేందుకు బయటకు రాగా, గుర్తుతెలియని ఐదుగురు దుండగులు అతడ్ని అడ్డుకొని అగ్గిపెట్టె అడిగారు. లేదని చెప్పి హాల్లోకి వెళ్తుండగా, జేబులోని డబ్బులివ్వాలని, లేని పక్షంలో చంపుతామంటూ కత్తులతో బెదిరించారు. అనంతరం అతని జేబులో ఉన్న రూ.2500ను లాక్కున్నారు. ప్రతిఘటించిన మణిని నలుగురు దుండగులు పట్టుకోగా, మరో దుండగుడు కత్తితో పొడిచి పరారయ్యారు. భార్య, స్థానికుల సాయంతో బాధితుడ్ని జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు దోపిడీ కేసును నమోదు చేశారు.

నిందితుల గుర్తింపు ఇలా..

ఘటన స్థలంతో పాటు, పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీల ద్వారా నిందితులను గుర్తించారు. తడికల బజార్ సెంటర్‌కు చెందిన ప్రణయ్‌కుమార్, కుసుమ దళితవాడకు చెందిన కన్నయ్య, మల్లి, అయ్యప్పగుడి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఖలీ, యూనీస్‌గా గుర్తించారు. నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్ వద్ద నిందితులు ఉన్నారనే పక్కా సమాచారం ఇన్‌స్పెక్టర్‌కు అందింది. ఆయన నేతృత్వంలో ఎస్సై, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని నిందితులను అరెస్ట్ చేశారు. దోపిడీకి ఉపయోగించిన ఐదు కత్తులను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మణిని కన్నయ్య, మల్లి, ఖలీ, యూనీస్ పట్టుకోగా.. ప్రణయ్‌కుమార్ కత్తితో పొడిచారనే అంశం విచారణలో వెల్లడైంది. నిందితులు ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నారని, ఇప్పటికే పలుమార్లు అరెస్టయి జైలుకెళ్లారని డీఎస్పీ తెలిపారు. దోపిడీ దొంగలను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై, ఏఎస్సై శ్రీహరి, హెడ్ కానిస్టేబుళ్లు సురేష్, నరసయ్య, కానిస్టేబుళ్లు శ్యామ్, వర్ధన్‌ను డీఎస్పీ అభినందించారు.

ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. స్టోన్‌హౌస్‌పేటలోని శివాజీనగర్‌లో నివాసం ఉంటున్న మాలకొండారెడ్డి (61), రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. చెక్క బండి నడుపుకొని కుటుంబాన్ని పోషిస్తున్న మాలకొండారెడ్డి మద్యానికి బానిసయ్యారు. సంపాదించిన మొత్తాన్నంత మద్యానికే వెచ్చించసాగారు. మద్యం మానేయాలని.. లేకపోతే ఆరోగ్యం పాడవుతుందని ఆయనకు నచ్చజెప్పేందుకు గత నెల 21న కుటుంబసభ్యులు విఫలయత్నం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన అదే రోజు మధ్యాహ్నం మద్యంలో పురుగుల మందును కలుపుకొని సేవించారు. అనంతరం ఇంటికి వచ్చి హాల్లో నిద్రపోయారు. కుటుంబసభ్యులు అతడ్ని లేపేందుకు సాయంత్రం యత్నించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను హుటాహుటిన రామచంద్రారెడ్డి ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో జీజీహెచ్‌లో బుధవారం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు నవాబుపేట పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఎస్సై తిరుపతయ్య పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని సైక్లిస్ట్‌కు తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైమ్): లారీ ఢీకొనడంతో సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడిన ఘటన హరనాథపురం జంక్షన్లో శుక్రవారం చోటుచేసుకుంది. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌లోని మసీదు సెంటర్‌కు చెందిన రామ్మూర్తి మినీబైపాస్‌లోని ఓ పార్టీ కార్యాలయం ఎదురుగా గల పెట్రోల్ బంక్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కూరగాయలను తెచ్చుకునేందుకు గానూ ఇంటి నుంచి సైకిల్‌పై ఏసీ మార్కెట్‌కు బయల్దేరారు. హరనాథపురం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముత్తుకూరు వైపు నుంచి చిల్డ్రన్స్ పార్క్ రోడ్డుకు తిరుగుతున్న లారీ ఢీకొంది. ఘటనలో అతని కుడికాలుకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు ఆయన్ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, ఎస్సై గీతారమ్య ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాలను అడ్డుకున్న సీపీఎం నేతలు

రోడ్డు ప్రమాద నేపథ్యంలో వాహనాల రాకపోకలను సీపీఎం నేతలు అడ్డుకున్నారు. భారీ వాహనాల రాకపోకలతోనే ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, నేతలు శ్రీను, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. లక్ష్మీనగర్‌లోని బ్యాంక్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు (60), ఉషా దంపతులు. విజయమహల్ గేట్ సమీపంలో మెడికల్ షాపును ఆయన నిర్వహిస్తున్నారు. కుమారుడు ఐదేళ్ల క్రితం మృతి చెందగా.. కుమార్తె కల్యాణి విజయవాడలో ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో వెంకటేశ్వర్లు అప్పులపాలయ్యారు. ఇటీవల కొంతమేర అప్పులను కుమార్తె తీర్చారు. అయినా ఇంకా అప్పులున్నాయి. ఈ క్రమంలో కుమార్తె వద్దకు ఉషా గురువారం వెళ్లారు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లు తన ఇంట్లో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. భార్య ఫోన్ చేయగా ఆయన ఎంతకీ తీయకపోవడంతో పక్కింటి వారికి సమాచారమిచ్చారు. వారు ఇంటికెళ్లి చూసి అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. సమాచారం అందుకున్న భార్య, కుమార్తె నెల్లూరుకు శుక్రవారం రాత్రి చేరుకొని బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుమన్ ఆస్పత్రికి చేరుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
శనివారం ॥ 4-3-2023



● కె. రామలక్ష్మి

తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.

నివాళి

ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్ 31న జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి.

ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవన జ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ప్యానెల్ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్ఆర్‌నగర్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

స్టెల్లా మేరీ స్టూడెంట్

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్ ఏ స్టెల్లామేరియన్' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం



● కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్30న రిజిస్టర్డ్ మేరేజీ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.

ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం. వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్పజెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

సినిమా రచయిత్రి

కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పని చేశారు.

స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. పెళ్లి ప్రేమను చంపేస్తుంది అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, చొరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ





● విజేత కుమార్

ఫుట్‌బాల్ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్ అధికార్ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్ క్లబ్'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

కట్ చేస్తే...

ముంబైలో ఉంటున్న విజేత కుమార్ బ్రాండెడ్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్ ఫిల్మ్ 'బ్లాజ్' న్యూయార్క్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ షార్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్ ఆట వల్ల తమలో పెరిగిన

> 'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్ బాల్స్' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్

ఏమి చేయకూడదంటే...

అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.



● మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి. ● ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్రపోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్ ముంచి అయినా మేకప్ క్లీన్ చేయాలి. ● మేకప్ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేసుకుని, వాటిని కిట్ నుండి తొలగించాలి. ● మేకప్‌లో ఫౌండేషన్ ఇంపార్టెంట్. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్ కలర్‌కు సూటయ్యే షేడ్ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి. ● హెయిర్ కండిషనర్ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్ వాడాలి.

ఇంటిప్స్

సహజమైన రూమ్ ఫ్రెష్‌నర్

- అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్ లవెండర్ ఆయిల్ లేదా ఆల్మండ్ ఆయిల్ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.
- దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్ స్పూన్ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!
- సింక్ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్ జోలికి పోకుండా సింక్ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.



● పచ్చదనాల పొదరిల్లు

మొక్కలో మొక్కనై!

**మందారాలు 16 రంగులున్నాయి.
జామ చెట్లు ఏడురకాలున్నాయి.
అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.
వేప, సీమచింత, కానుగ...
మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...
కుండీల్లో ఒదిగిపోయాయి.
రణపాల, కొండపిండి...
ఇన్సులిన్ ప్లాంట్, కప్పరిల్ల...
ఔషధమొక్కల లిస్ట్ ఇది.
ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.
మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.
మనం తినే పంటలు పండించుకుంటున్నాం.
పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.**

''ఆమెకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

సేకరణ చిన్న పని కాదు!

''నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్ వైన్ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్ గార్డెనర్ మాధవి గారి గార్డెన్ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాన'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్ మీద ఇంత బరువు పెడుతున్నావు. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది'' అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి

ఎనిమిదిళ్లు మారాను!

మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు. 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.

– గుడి మంజుల, మొక్కల ప్రేమికురాలు

